


తెల్లవారింది. నెమ్మదిగా కళ్ళు తెరిచింది వరలక్ష్మి. లేచి కూర్చుంది. కప్పు మధ్య తాటాకుల్లోంచి వెలుతురు ఆఖరి దాని మొఖం మీద పడుతోంది.

"నా కర్మ కొద్దీ ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు" రోజుకి లక్షసార్లు అనుకునే మాటనే, ఓసారి అనుకుని లేచి పిల్లలకి చీర సమంగా కప్పింది. బయటికి వచ్చి, పొయ్యిలో చూసింది. బూడిద లేదు. కచికలు లేవు. నిన్న పొయ్యి వెలిగించలేదన్న సంగతి గుర్తుకొచ్చింది. వెంటనే ప్రక్కకి తిరిగి తోటికోడలు పొయ్యిలోంచి ఓ రెండు కచికలు తీసుకుని, కొంచం చేతిలో వేసుకుని, మిగిలింది గూట్లో ఉంచి, చూరునుంచి ఓ ఆకు పీకి, మొత్తానికి మొహం కడగటం అయిందనిపించింది. లోపలికొచ్చి బిందెలోంచి ఓ గ్లాసుడు నీళ్లు త్రాగి, చీర సరిచేసుకుని తలుపు దగ్గరగా వేసింది.

"ఇవాళ ఆ గుమాస్తాగారింటికి చుట్టాలొస్తున్నారు. తెల్లార గట్టే రమ్మందావిడ. వెధవ మొద్దు నిద్ర పట్టేసింది." అనుకుంటూ వడివడిగా నడిచింది. ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. నిన్న రోజంతా కాస్త మజ్జిగ అన్నంతోనే వెళ్ళబుచ్చింది. ఇవాళ ఆవిణ్ణడిగి ఓ సోలెడు బియ్యం తెచ్చుకోవాలి" మనసులో అనుకుంది.

చలి విపరీతంగా ఉంది. దారిలో అందరూ ముంగిళ్ళలో ముగ్గులు పెడుతున్నారు. సంక్రాంతి దగ్గరకు వచ్చేసింది.

'హుం....ఈ సంక్రాంతే కదూ తన జీవితాన్ని నాశనం చేసింది. అంతవరకూ ఉన్నా లేకపోయినా కలో గంజో తాగి ఉండేవాళ్ళం. ఈ సంక్రాంతికి సరిగ్గా ఆయనెళ్ళి నాలుగేళ్ళు నిండుతాయి. ఎక్కడున్నారో ఏమో కనీసం పిల్లల్ని చూడాలని కూడా అన్పించలేదేమో' అడుగులేస్తూ ఇల్లు చేరింది.

"ఏమే లక్ష్మీ. అవసరం అయినప్పుడే ఆలస్యం చేస్తావు నీకున్న బుద్ధే అది" కసురుకుంటూ నూతి పళ్ళెంనిండా ఇంకెడు గిన్నెలూ పడేసిందావిడ.

వరలక్ష్మి అతిసాధారణమైన తెలుగు ఆడపడుచు. చామన ఛాయ రంగు, పీల శరీరం. ఆమె అలంకారాలు – మెళ్ళో ఉన్న ఆ నల్లపూసల దండ, నుదుటి బొట్టూను. మొగుడు ఏదో కంపెనీలో వాచ్‌మన్‌గా పని చేసేవాడు. ఇప్పుడు చేయటం లేదా అంటే తెలియదు. అసలెక్కడున్నాడో కూడా తెలియదు, అతడు ఇంటినుంచి వెళ్ళిపోయి నాలుగేళ్ళయింది. సంక్రాంతికి ముందు భార్యా భర్తలిద్దరికీ జరిగిన చిన్న గొడవ దానికి కారణం. అప్పట్నించీ తాను మంచినీళ్ళు త్రాగయినా పిల్లలు ముగ్గురికీ ఇంత మజ్జిగా అన్నం పెడుతోంది వరలక్ష్మి. తొమ్మిది నెలలు మోసి కన్న పాపానికి వాళ్ళనేం చేయగలదు. ఉన్నంతలో పెంచటం తప్ప.

రాత్రీ పగలూ ఒళ్ళు హూనం అయ్యేట్లు పని చేస్తుంది. తెల్లారగట్లే మూడు గంటలకు లేచి ఓ నాలుగయిదిళ్ళలో అంట్లుతోమడం వంటి పనులు చేస్తుంది. వాళ్లు కాస్త ఉన్నవాళ్ళే కాబట్టి ఏదో ఒక పూట అన్నం, ఓ పూట చారు, ఏడాదికో పాత బట్ట ఇచ్చి కాస్త చూస్తున్నారు. ప్రొద్దున్నే ఉంటే రెండు మెతుకులు తిని కంపెనీకి పోతుంది. ఆమె చేసే పని వక్కపొడి కంపెనీలో పొట్లాలు కట్టడం. ఈ నాల్గేళ్ళ నుంచి ఏదో విధంగా బండిని లాక్కొస్తోంది. ఓ నాల్గు రూపాయలు పడేసి చెప్పులు కొనుక్కుందామనుకుంది వేసవి కాలంలో. మళ్ళీ వేసవి వచ్చేస్తోంది. ఈ బ్రతుకు తెల్లారేదెప్పుడో?

తన దురదృష్టానికి తోడు అన్నట్లు తనకి

ముగ్గురూ ఆడపిల్లలే. వాళ్లా పెద్దవాళ్ళవుతున్నారు. తండ్రి వదిలేసిన పిల్లలంటే ఎంత లోకువ. అయినా ఆడపిల్లల తోటి ఎన్ని జాగ్రత్తలు, ఎన్ని భయాలు... అమ్మో.

"ఏమిటే అలా తోమిండే తోముతున్నావు. కాస్త త్వరగా కానీ నేనా నూతి దగ్గర స్నానం చెయ్యాలి" తులసి చెట్టు అరుగు మీద కూర్చున్న బామ్మగారో కేక పెట్టింది.

తేరుకుని గబగబా తోమడం మొదలెట్టింది. చలిలో చేతులు కొంకర్లు పోతున్నాయి. మళ్ళీ ఆవిడ గట్టిగా పిలిచి—

"ఏమే నిన్ను వాడు పూర్తిగా వదిలేసినట్లేనా ఇంక. ఏమైనా ఉత్తరం ముక్క రాసాడా.... అదీ లేదా. అయినా వాడి మొహం మండ... పెళ్ళి చేసుకుని లక్షణంగా ముగ్గురు పిల్లల్ని కన్నాక హఠాత్తుగా ఇల్లొదిలిపోయాడు. వాడికేం పొయ్యేకాలం. పోనీ ఓ దారీతెన్నూ చూపించాడా అంటే అదీలేదు. సాంప్రదాయమైన కుటుంబంలో పుట్టిన నీకిదేం ఖర్మే తల్లీ. అయినా పొట్టివాడికి పుట్టెడు బుద్ధులని, ఆ వెధవని చూసినపుడే నేననుకున్నాను. వీడేదో తిరకాసు మనిషి అని. ఇంతకీ అంతా నీ ఖర్మ పుట్టింది ముగ్గురూ ఆడపిల్లలాయె....ఎలా ఈదుతావో ఏమో. పోన్లే భగవంతుడు చల్లగా చూస్తే అంతే చాలు. ఇదిగో కాస్త వెళ్ళిపోయేటప్పుడు, ఓ అరిటాకు ముక్క తెచ్చుకో కాస్త మాగాయి పెడతాను" అంటూ, ఆవిడ పంచె తెచ్చుకోవడానికి లోపలికి వెళ్ళిపోయింది.

వరలక్ష్మికి కన్నీళ్ళు ఆగలేదు. సరిగ్గా నాలుగేళ్ళ క్రితమే కదూ చిన్న గొడవయింది. అదేం పెద్ద గొడవని ఆ మనిషికంత కోపం రావడానికి. అసలు తనేమందని. పండగలకెప్పుడు మీరే బట్టలు కుట్టించుకుంటున్నారు. ఈసారి పిల్లలకి తీయిద్దాం అంది.

"వస్తాయే పిల్లలకి గౌన్లు వస్తాయి. నీకు బనారసు చీరలు వస్తాయి. నీ అబ్బిచ్చిన ఆస్తి ఇక్కడ మురిగిపోతోంది కదూ. దరిద్రపు దానా. నోరెత్తావంటే చంపేస్తాను. కుక్కిన పేనల్లే పడుండు. పండక్కి గౌన్లు తేవాలిట, దీనికి గౌన్లు" వరుసగా గ్రుద్దులు, తన్నులు. అవే చివరి ఘాటలు, ఆ రాత్రి ఎక్కడికో వెళ్ళి, మళ్ళీ తిరిగి రాలేదు. తాను తర్వాత ఎంత ఎదురు చూసింది. అసలా మనిషితో తనేం సుఖపడింది. ఒళ్ళు హూనమయేలా తన్నులు, గుద్దులు జుట్టుపట్లు తప్ప. సృష్టి సహజమైన కోర్కెకి రూపంగా ఓ ముగ్గురు పిల్లలు, తన ఆడతనాన్ని ఋజువు చేసేందుకు. చేసేది వాచ్‌మన్ ఉద్యోగం అయినా, బయటికెళ్ళేటప్పుడు వెలిగిపోయేలా ఉండేవాడు. తర్వాత ఏదో వెధవపని చేశాడని ఉద్యోగం తీసేస్తే ఆ కోపం కాస్తా తనమీద చూపడం, ఇప్పుడెక్కడున్నట్టు? ఏమైనట్టు? గిన్నెలన్నీ బోర్లించి రెండో ఇంటికి బయలుదేరింది.

ఈ ఇళ్ళన్నీ చేసుకునేసరికి ఆరు, ఆరున్నర అవుతుంది. ఇంటికెళ్ళి ఓ సారి పిల్లల్ని చూసుకుని, ఏదేనా వుంటే కాస్త గొంతులో వేసుకుని, కంపెనీకి పోవాలి. చచ్చీచెడి కళ్ళద్దుకుంటూ సాయంత్రానికి ఇంటికి చేరుతుంది. కంపెనీ నుంచి, మధ్యాన్నం ఓసారి వచ్చి పిల్లల్ని చూసుకుంటూ వుంటుంది వీలయినప్పుడు. ఇంకా తోటికోడలు కాస్త కనికరించి, ఓ ప్రక్క ఇంత చోటిచ్చింది. కాబట్టి ఆ బాధ లేదు. అయినా ఏ రోజూ రెండు పూటలా ఇంత మజ్జిగా అన్నం పిల్లలకి పెట్టి తాను తిన్న పాపానలేదు.

ఆలోచనలతో గబగబా ఇంటికి చేరింది. మూడోది లేచి బట్టలు తడుపుకుని ఏడుస్తోంది. పిల్లలు ముగ్గురికీ నీళ్ళు పోసి, తెచ్చిన అన్నంలో మజ్జిగ కలిపి ముగ్గురికీ పెట్టింది. సాయంత్రం మళ్ళీ వరలక్ష్మి వచ్చే వరకూ ఏదో ఓ పంచన ఉంటారు. వాళ్ళు వచ్చేటప్పుడు ఆ మేనేజరుగారి పెళ్ళాం నూకలిస్తానంది. మర్చిపోకుండా వెళ్ళాలి. అనుకుంటూ, పిల్లల్ని అరుగు మీద కూర్చోపెట్టి, "అక్కయ్యా నేను వెళుతున్నాను, కాస్త వీళ్ళని చూస్తూండు" అని రోజూ చెప్పే ముక్క చెప్పి బయలు దేరింది.

కాళ్ళు తడబడుతున్నాయి. అయినా తప్పదు. కొంగున కట్టిన పావలా సరిగా వుందో లేదో అని చూసుకుంది.

ఈ నెల కూడా కాస్త కష్టపడి ఓ ఐదు రూపాయలు కూడా బెడితే మొత్తం తన దగ్గరవి యాభై అవుతాయి. కాలిమట్టెలు రెండున్నాయి. అవి అమ్మితే ఇంకొంచెం డబ్బు వస్తుంది. ఇక నల్లపూసల మధ్యలో వేసుకునే చిన్న బంగారు పూస ఒకటి వుంది. ఈ మొత్తం కలిపితే ఓ వంద రూపాయలు అవచ్చు. ఎలాగైనా సరే ఈ పండక్కి పిల్లలకి గౌన్లు కొనాలి. కాస్త దళసరిది. ఎన్ని చీరలు కప్పినా చలికి వణికి పోతున్నారు. వెర్రికుంకలు ప్చ్. అయినా తనేం చెయ్యగలదు. ఈ నాలుగేళ్ళలో చచ్చీ చెడి పైసా పైసా కూడబెడితే మొత్తం యాభై రూపాయలు అయింది. పెద్దదానికి పదేళ్ళు వస్తున్నాయి. అయినా పట్టుమని పది అడుగులు వెయ్యలేదు. రెండోదాని కెప్పుడూ దగ్గు, జలుబూ డాక్టరు రాసిచ్చిన మందులెప్పుడూ వాడలేదు. మూడోదాని కింకా సరిగ్గా మాటలే రావు. భగవాన్ వీళ్ళనెలా పెంచను ఏంచేయను?

"అబ్బా" రాయి ఎదురుదెబ్బ తగిలి గోరు

## వనిత మాటల కొలువు – 77

సరైన సమాధానం:

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 అ | సు | 15 వు | 16 లు | | | 2 గ | యా |
| ప | | 3 ల | అ | 17 కా | 18 ప | రి | |
| 4 రి | ప్ప | నె | | హ | స | న | 19 ము |
| చి | | | 9 హా | ళి | గ | | సు |
| 7 త | 20 ల | 21 కా | యు | | 8 ల | 22 తి | క |
| | 23 ప్ప | చి | | 10 పం | ది | లి | |
| 23 వి | | | 11 న | డు | | 12 వె | 24 ల్లి |
| 13 దీ | క్ష | | 14 ఆ | వ | ల | | పి |

పై సమాధానంతో సరిపోయే సమాధానం పంపిన వారు ఎక్కువమంది ఉండడం వల్ల, లాటరీ పద్ధతిలో పదిహేను మంది పేర్లు తియ్యవలసి వచ్చింది. ఆ విధంగా గెలుపొందిన వారు:

1. కె. ఉష, వేములవాడ 2. కె. శారద, ఉయ్యూరు 3. ఎ. హెచ్. రమాదేవి, విశాఖపట్నం 4. కె. మాధవి, కొరుకొండిపర్రు (గుంటూరు జిల్లా) 5. కె. శశి, విజయవాడ 6. లక్ష్మీ తిరుపతమ్మ, గుంటూరు 7. వి. కమలమ్మ, బాగలమర్రి 8. ఎమ్. ఎన్. జ్యోత్స్న, హైదరాబాదు 9. కె.ఎం. కరుంతల, మూలాకము (ధర్మపురిజిల్లా) 10. బి. సర్వమంగళాంబ, కోటపాడు అగ్రహారం (శ్రీకాకుళం జిల్లా) 11. ఆర్. దీప, కోరగుంటపల్లి 12. ఎం. లక్ష్మి, ఆదిలాబాదు 13. ఎం. రాధిక, తరిగొండ 14. సత్యవాణి పప్పు, కొంబాయి 15. వి. సుబ్బలక్ష్మి, వరంగల్.

బహుమతి మొత్తం రూ. 150 లు వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.

చిట్లడంతో ఈ లోకంలోకి వచ్చింది. నెమ్మదిగా కుంటుకుంటూ గేట్లోంచి లోపలికి ప్రవేశించింది.

కంపెనీ నుంచి బయటపడే సరికి అరయింది. ప్రాణం శరీరం వదిలి బయిటికి పోతున్నట్లుంది. నిస్పృహగా అడుగులు వేస్తూ ఇంటికి చేరింది. శీతాకాలం కావడం వల్ల చీకట్లు త్వరగా ముసురుకుంటున్నాయి. మధ్యాహ్నం ఇంటికి రావడానికి వీలుపడలేదు. ప్రొద్దున్నుంచీ ఓ పావలా టీ నీళ్ళు తప్ప ఇంకేమీ నోట్లో వేసుకోలేదు. దగ్గరకు వేసిన తలుపులు నీరసంగా త్రోసింది. లోపలికి అడుగు పెట్టబోతూ ఒక్కక్షణం కొయ్యబారి పోయి అలాగే నిల్చుండి పోయింది.

ఎక్కణ్ణించి వచ్చాడో, ఎప్పుడొచ్చాడో మొగుడు మంచం మీద బోర్లా పడుకుని గుర్రు పెడ్తున్నాడు. ఓ క్షణం ఆగి వంటింట్లోకి తొంగిచూసింది. అన్నం వండిన గిన్నెమీద రెండు మూడు మెతుకులున్నాయి. ప్రొద్దున్న బామ్మగారిచ్చిన ఊరగాయ అయిపోయిందన్నట్లు అరిటాకు మీద ఎర్ర చార మాత్రం మిగిలింది. గిన్నెలో చేయి కడిగిన నీళ్ళు సగం వరకూ ఉన్నాయి. ఒక్క క్షణం ఏం చెయ్యాలో పాలు పోలేదు. వెనక్కి తిరిగి ఒక్కసారి మొగుణ్ణి చూసింది. మనిషి బాగా మీసాలు, గడ్డాలు పెంచాడు. పెదాలు ఎర్రగా, బండబారి ఉన్నాయి. బనీను బాగా చిరుగులు పట్టింది. ఓ మాసిన పంచె కట్టుకున్నాడు. గదిలో దణ్ణెం మీద పాంటు, ఓ మాసిన తెల్ల చొక్కా వేలాడుతున్నాయి. కళ్ళలో నీళ్ళు గిర్రుమని తిరిగాయి వరలక్ష్మికి. 'ఎక్కణ్ణించి వచ్చారో ఏమో. పిల్లలు చూశారా ఈయన రావడం' అనుకుంటూ పెరట్లోకి పరిగెట్టింది. ఇంతలో తోడికోడలు "ఏమే వరం, మీ ఆయనొచ్చాడేవ్. ఇందాకానే రెండగ్గిపుల్లలు కావాలంటే ఇచ్చాను. ఈ వెధవాయిలు చూడు. చచ్చినా వాళ్ళ నాన్న దగ్గరకి వెళ్ళటం లేదు. మర్చిపోయారో ఏమో." అంటూ పిల్లల్ని చూపించింది. పెద్దవాళ్ళిద్దరూ ఓ మూల కూర్చున్నారు. మూడోది అరుగుమీదే నిద్రపోయింది. నెమ్మదిగా వాళ్ళని తీసుకుని లోపలికి నడిచింది.

ఇంట్లో అసలు ఏమీ లేవు. రాత్రికి ఏదో ఒకటి చెయ్యాలిగా. తప్పదు. గబగబా ట్రంకు పెట్టెలోంచి పది రూపాయల నోటు తీసుకుని సంచి భుజాన వేసుకుని కొట్టుకు పరిగెట్టింది. బియ్యం, చింతపండు, మిరపకాయలు, ఉప్పు అన్నీ తెచ్చింది. వచ్చేటప్పుడూ బంగాళాదుంపలూ, వంకాయలూ, ఉల్లిపాయలూ కూడా తీసుకుంది. ఇవన్నీ సంచీలో వేసుకుని ఇంటికొచ్చేసరికి మొగుడు నిద్రలేచాడు. పెళ్ళాన్ని చూస్తూనే ఓ నవ్వు నవ్వాడు.

"ఎక్కడికెళ్ళావు ఇంతసేపు?"

మాట్లాడకుండా లోపలికి వెళ్ళింది. సంచీ ఓ ప్రక్కన పెట్టి నెమ్మదిగా వంటకుపక్రమించింది. 'ఇన్నాళ్ళు ఉన్నానో, చచ్చానో కనుక్కోని మనిషి ఇవాళెందుకొచ్చినట్టు? ఏం ఉందని వచ్చాడు? ఎక్కడికెళ్ళావని అధికారంగా అడుగుతున్నాడు? ఇన్నాళ్ళూ ఏమయిందా అధికారం?' ఆలోచనలతో పాటు ఎసరు కూడా మరిగింది.

పిల్లలు నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్ళారు. ముగ్గురి చేతుల్లోనూ బిస్కట్లు ఉన్నాయి. 'ఓహో సంపాదన కూడా ఉందన్నమాట' మనసులో అనుకుంది.

పిల్లలకి మొదటిసారి తృప్తిగా కడుపునిండా అన్నం పెట్టి పడుకోబెట్టింది. తర్వాత మౌనంగా ఇద్దరూ అన్నం తిన్నారు. అన్నీ సర్దేసి పడుకోబోతుంటే అడిగాడు.

"నెలకి ఎంతిస్తున్నారేవిటి?"

సమాధానం చెప్పలేదు.

"మొగుడికి సమాధానం చెప్పకూడనంత ఎక్కువా? ఏం?" గద్దించాడు.

ఇష్టం లేకపోయినా చెప్పింది.

'ఇన్నాళ్ళు ఎలా ఉన్నానో, ఏం చేశానో అక్కర్లేదు. జీతం ఎంత అని మాత్రం కావాలి. ఏం మనిషి.'

"ఇటురా"

లేచి వెళ్ళింది.

"కూర్చో."

మంచం కోడు మీద కూర్చుంది.

"ఇలా చూడు కోపం పోలేదా ఇంకా"

'హు...ఎంత తియ్యగా మాట్లాడుతున్నాడు.'

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నాననుకుంటున్నావు? ఓ బట్టలషాపులో ఉద్యోగం సంపాయించాను. ఎన్నిసార్లో ఇక్కడికి వద్దామనుకున్నా, వీలు లేకపోయింది. ఏం చేయను. నా పని అలాంటిది. పగలూ, రాత్రి నువ్వూ, పిల్లలే నా కళ్ళముందు మెదిలేవారు. అందుకే వీలు చూసుకుని శెలవుపెట్టి వచ్చేశాను. నిన్నూ పిల్లల్నీ తీసుకుపోదామని."

మొగుడికేసి అనుమానంగా చూసింది. సమాధానంగా చిరునవ్వు నవ్వాడు. కబుర్లు ఎంత తియ్యగా చెబుతున్నాడు. మగమహారాజు .... అతనికేం, ఎక్కడేనా తల దాచుకుంటాడు. మరి తను. ఆడది. ముగ్గురు పిల్లలతోటి ఎలా బ్రతికింది ఈ నాలుగేళ్ళు తలుచుకుంటే భయమేస్తోంది.

ఆలోచిస్తూ లేచి నిలుచుంది.

"ఇదిగో. ఓ రూపాయుంటే ఇయ్యి. సిగరెట్లయిపోయాయి"

"లేవు" అదోరకంగా నవ్వాడు.

"ఓస్. ఉద్యోగం చేసే ఆడదానివి. తేతే ముందు."

బలవంతంగా లేచి, కుంకుం బరిణెలో దాచిన చిల్లర తీసి ఇచ్చింది. మొగుడు బయటికి వెళ్ళిపోయాడు. ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది వరలక్ష్మి.


పది రోజులు గడిచాయి. ఆమె పనిచేసే కంపెనీలోనూ, చుట్టు ప్రక్కలా వరలక్ష్మి మొగుడు వచ్చేశాడన్న సంగతి అందరికీ తెలిసిపోయింది.

"అదృష్టవంతురాలివే లక్ష్మి...మొగుడు తిరిగి వచ్చాడు. అంతకన్న ఏం కావాలి ఆడదానికి" అన్నారందరూ.

ఆ పది రోజులూ పండగల్లాగే గడిచాయి వరలక్ష్మికి. ఉన్నంతలో లోటు లేకుండా గడిచింది. 'మొగుడు వచ్చేశాడు. తన మొగుడు వచ్చేశాడు. ఇక తనూ అందరిలా దర్జాగా బ్రతకచ్చు. ఎవరి



చేపలు కోసేముందు, చాకు పదునైన భాగాన్ని మెత్తటి ఉప్పులో ముంచినట్లయితే సులభంగా కోయవచ్చును.



మాంసం వండుతున్నప్పుడు అందులో ఒక అల్లం ముక్క వేసినట్లయితే త్వరగా ఉడుకుతుంది.

ముందూ తల వంచి నిలబడక్కర్లేదు.' తృప్తిగా నిట్టూర్చింది.

వరలక్ష్మిని భర్త ఒక్కక్షణం కూడా వదలటం లేదు. వంటింటి పనుల్లో కూడా వెనకాలే ఉంటున్నాడు. వరలక్ష్మి పన్లోకెళితే పిల్లల్ని చూసుకుంటున్నాడు. తన సంసారం స్వర్గం లాగే ఉందనుకుంది వరలక్ష్మి.

ఆ మర్నాడు భోగి. పిల్లలకి బట్టలు కొందామనుకుంది. కాని మళ్ళీ పాత సంఘటన కళ్ళ ముందు మెదిలి, భయంతో ఊరుకుంది.

"ఫస్ట్‌షో సినిమాకి తీసికెళతాను. తయారవ్వు సాయంత్రం" అన్నాడు. సంతోషంతో పిల్లల్ని తయారుచేసి, తనూ తయారయింది. అంతా సర్ది తలుపుకి తాళం వెయ్యబోతుంటే అన్నాడు క్రాపు చేత్తో రాసుకుంటూ.

"డబ్బేమైనా ఉంటే తీస్కురా. నా దగ్గిరవి సరిపోవు."

గతుక్కుమంది.

పైన పెట్టిన చిల్లర డబ్బులన్నీ అయిపోయాయి. పెట్లో డబ్బులు తీయాలి. అతని ఎదురుగుండా పెట్టె తీయడం ఇష్టం లేదు. అయినా తప్పదు. అతను తన భర్త మరొకళ్ళు కాదు.

లోపలికెళ్ళి పెట్టెలోంచి పది రూపాయలు తీసుకొచ్చి ఇచ్చింది.

మనిషి మారాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. అదే పదివేలు. తాళం వేస్తూ తృప్తిగా అనుకుంది.

సినిమా మొదలయింది. మామూలు తెలుగు సినిమా. మొదటి సగం భార్యని నానా హింసకూ గురి చేసి, భర్త చెడు తిరుగుళ్ళు తిరుగుతాడు. రెండో సగంలో ఆ భార్య ప్రేమతో, అనురాగంతో అతనిని మారుస్తుంది. వాళ్ళ జీవితం స్వర్గధామం అవుతుంది.

హీరోయిను కష్టాలు చూస్తుంటే వరలక్ష్మికి కన్నీళ్ళాగలేదు. తానే ఆ హీరోయిను అయినట్లు, తన భర్త ఆ హీరో అయినట్లు ఊహించుకుంది. మొదటిసారిగా జీవితంలో ఆడదానిగా పుట్టిన తన జన్మ సార్థకమైందనుకుంది. తొలిసారిగా తన ముగ్గురు కూతుళ్ళని చూసి మురిసిపోయింది. మహా పతివ్రతలని కన్న భారతదేశం ఇది. వాళ్ళ రక్తం తనంలోనూ ఉంది. భర్త అపచారాలు, తప్పిదాలు సహించి, ప్రేమతో వాళ్ళని మార్చి జీవితాన్ని నందవనం చేయడం భారత స్త్రీకే చెల్లింది. ఆ తెర మీద హీరోయిన్‌లాగే తను జీవితంలో విజయం సాధించింది. వరలక్ష్మికి ఆగకుండా ఎక్కిళ్ళు వచ్చాయి. ముందు వాళ్ళు ఒకరిద్దరు వెనక్కి తిరిగి చూశారు. ఆమె మొగుడు విసుగ్గా చూసి "ఇక చాల్లే ఊరుకో', అన్నాడు.

పిల్లలు సగం సినిమాలోనే నిద్రపోయారు. ఇద్దరూ వాళ్ళని తీసుకుని రిక్షాలో వచ్చారు. ఇంటికి రాగానే శుభ్రంగా మొహం కడుక్కుని బొట్టు పెట్టుకుంది. ఇద్దరూ మౌనంగానే భోజనం చేశారు.

ఆమె మొహం మీద, కంటి దగ్గర ఇంకా చారలు కన్పిస్తున్నాయి. వంటిల్లు అంతా సర్ది, నిదానంగా భర్త దగ్గరికి వచ్చింది.

అతను మంచం మీద తలకింద చేతులు పెట్టుకుని, వెల్లకిలా పడుకుని చూరుకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

గభాలునవచ్చి అతని పాదాల మీదపడి "నన్ను క్షమించండి" అంది ఏడుస్తూ.

అతను ఆమెకేసి ఒకసారి చూసి "ఊరుకో ఊరుకో పిల్లలు లేస్తారు" అన్నాడు.

*

నులివెచ్చని కిరణాలు కళ్ళ మీద పడడంతో మెలకువ వచ్చింది. వరలక్ష్మికి. బార్లా తీసిన తలుపులలోంచి ఎండ వస్తోంది.

"అబ్బా. బారెడు ప్రొద్దెక్కింది. ఇంత బార్లా తలుపులెవరు తీశారు ప్రొద్దున్నే" అంటూ లేచి కూర్చుంది. ఇంకా నిద్రమత్తు, రాత్రి జ్ఞాపకాలు వదలలేదు. కొంచెం ఒళ్ళు విరుచుకుంటూ, భర్తని చూద్దామని మంచంకేసి చూసి గతుక్కుమంది. మంచం కింద చూసింది. అతని చెప్పులు లేవు.

కంగారుపడుతూ "ఇంత ప్రొద్దునే ఎక్కడికెళ్ళారు" అనుకుంటూ పెరట్లోకి వెళ్ళింది. గబగబా తిరిగివచ్చి అతని చేతి సంచీ కోసం వెదికింది. కనిపించలేదు. ఒక్కసారి మతిపోయినట్లయి పాత ట్రంకుపెట్టె దగ్గరికి పరిగెట్టింది. తన చీరలు, పిల్లల గౌనులు అన్నీ కెలికేసి ఉన్నాయి. ఈ నాలుగేళ్ళ నుంచీ దాచిన డబ్బు, కాలిమట్టెలు, బంగారం పూస ఉంచిన పొట్లం ఏమీలేవు. ప్రాణం లేని బొమ్మలా పెట్టె పట్టుకుని అలాగే కూర్చుండిపోయింది వరలక్ష్మి.

తూరుపు నుంచి బయలుదేరిన వెలుగురేఖలు జగమంతా నిండుకుంటున్నాయి. కాని ఆమె జీవితంలోకి మాత్రం మళ్ళీ వెలుగు రాలేదు. □




డిసెంబర్ '81 "వనిత" ముఖచిత్రం ఆకర్షణీయంగా వుంది. "ఆమె" కథ చాలా బాగుంది. క్రైస్తవ వివాహ పద్ధతులు గురించి ముఖచిత్రం ద్వారా తెలియజేసినందుకు కృతజ్ఞతలు. మనకి ఎంతో అవసరమైన నిద్ర గురించి ప్రచురించిన వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది. నేటి సమాజపరంగా స్త్రీకి ఎలాంటి రక్షణ బాధ్యతలు వున్నవో తెలియజెప్పిన స్త్రీలు-చట్టాలు శీర్షిక వ్యాసం నిజంగా ఎక్సలెంట్.

వై. హిమబిందు, ప్రియ — డోర్నకల్

చరిత్ర సృష్టించిన స్త్రీలు : జోయా ధైర్యసాహసాలు చదివి మేమెంతో గర్వించాము. స్త్రీల అభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడ్డ సంస్కర్తలలో ప్రముఖులైన 'మహాకవి సుబ్రహ్మణ్యభారతి' శతజయంతి సందర్భంగా ప్రచురించిన ఈ వ్యాసం ఎంతో బాగుంది.

డి. సుజాత, సునీత, కమల — కోలనూరు

"గాజులు సిగ్గుపడుతున్నాయి" కథ చాలా బాగుంది.

కె. దుర్గాభవాని — మచిలీపట్నం

స్త్రీలు చట్టాలు రక్షణ సౌకర్యాలు వ్యాసం ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంది. అత్యాచారాలపై వనితా లోకం విప్లవ గర్జన — యథార్థ సంఘటన గురించి చదివి ఆశ్చర్యపోయాము.

మట్ట పద్మావతి, పర్వత వరలక్ష్మి — సంపర

డిసెంబరు నెల వనితలో, "స్త్రీలు-చట్టాలు-రక్షణ సౌకర్యాలు" అనే నా వ్యాసం ప్రచురితమయింది. అయితే అందులో 6 వ పేరాలో ఒక చిన్న పొరపాటు దొర్లింది. అది ఏ వ్యక్తి అయినా తన భార్య పదిహేను సంవత్సరాల లోపు బాలిక అయితే ఆమెను అనుభవించడం కూడా నేరమే అవుతుంది - అని ఉండాలి. పన్నెండు సంవత్సరాలు కాదు. ఈ పొరపాటుకు చింతిస్తున్నాను.

సుమిత్ర శ్రీపాద — విజయవాడ